క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్ వద్ద కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ వార్షిక తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యుత్ ప్రభతో పాటు మ్యూజికల్ నైట్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంకితభావంతో విధులు నిర్వహించండి

చీరాల టౌన్: పంచాయతీ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని.. ఎంపీడీఓ బి.శివన్నారాయణ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీలు, సచివాలయాల సెక్రటరీలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో చేస్తున్న నిర్మాణాల పనులు, ఉపాధి హామీ పనులు, పెండింగ్ బకాయిలు, ప్రధాన సమస్యలపై చర్చించడంతో పాటు పెండింగ్ అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. పంచాయతీల్లో, సచివాలయాల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలన్నారు. విధుల్లో అశ్రద్ధ వహించినా, ప్రజా సమస్యలను పట్టించుకోని వారిపై చర్యలు తప్పవన్నారు. పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

ట్రెజరీ అధికారికి సత్కారం


ఉప ఖజానాధికారిని సన్మానిస్తున్న ఎన్జీఓ సంఘ నేతలు

అద్దంకి: పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయం అధికారిగా ఇటీవల బదిలీపై ఖాదర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను మంగళవారం ఏపీ ఎన్జీవో అద్దంకి తాలూకా యూనియన్ సభ్యులు సత్కరించారు. ఎన్జీఓ అద్దంకి తాలూకా యూనియన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, క్యాదర్శి టి. రమేశ్ బాబు, ట్రెజరర్ జి. ఏడుకొండలు, సంయుక్త కార్యదర్శి కె. రవికుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కె. శ్రీనవాసరావు, సభ్యులున్నారు.

మండల సర్వేయర్‌గా బసవాచారి

చీరాల టౌన్: చీరాల మండల సర్వేయర్‌గా బసవాచారి నియమితులయ్యారు. చీరాల సర్వేయర్‌గా పనిచేసే బ్రాహ్మణయ్య సెలవులో ఉండటంతో కలెక్టర్, చీరాల మండల సర్వేయర్‌గా బసవాచారిని నియమించారు. మండల సర్వేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన చీరాల తహసీల్దార్ కె.గోపికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు సర్వేల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని తహసీల్దార్ సూచించారు.

చదువుకొని అభివృద్ధి చెందాలి


బాలికలతో మాట్లాడుతున్న ఎస్సై

బల్లికురవ: బాలికా విద్యకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని ప్రతి ఒక్కరూ చదువుకొని విద్యావంతులు కావాలని ఎస్సై వై. నాగరాజు కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఆయన బాలికలతో మాట్లాడారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహన కల్పించారు. జీవితంలో స్థిరపడేవరకు వివాహాలు చేసుకోవద్దని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ఎస్సై వివరించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ కె. సరళకుమారి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

అర్హులకూ శఠగోపం

- తల్లికి వందనం లబ్ధిదారులతో ఆటలు
- తమ పేర్లు లేకపోవడంతో సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరుతున్న బాధితులు



మార్టూరు: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. తల్లికి వందనం పథకానికి అర్హులైన లబ్ధిదారులకు అందక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది విద్యార్థులకు పాఠశాలలో సమస్యలు ఎదురవటం, మరి కొంత మందికి సాంకేతిక సమస్యల వలన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాకు జమ కావడం లేదు. అసలే సచివాలయాల్లో తగినంత సిబ్బంది లేకపోవడంతో అర్జీదారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా అర్హతకు మించి అదనంగా భూములు కలిగి ఉన్నారంటూ చాలామంది విద్యార్థులకు పథకం వర్తింప చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. తమకు లేని భూములను ఆన్‌లైన్లో ఉన్నట్లు కనిపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అరకొరగా ఉన్న భూములు ఆన్‌లైన్ చేయడానికే బల్ల కింద చేతులు చాచే అధికారులు తమకు లేని భూములు ఉన్నట్లు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం పలువురు ఇలా కనిపించారు. మండలంలోని తాటివారిపాలెం గ్రామానికి చెందిన చిలి వేరి వేణుబాబు దంపతులకు చెందిన ఇద్దరు పిల్లలు అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు తరగతులు చదువుతున్నారు. వేణు బాబుకు తన స్వగ్రామంలో ఖాతా నెంబర్ 1526లో 1.40 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. వాస్తవానికి ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకానికి అర్హులవుతారు. కానీ అదే ఖాతా నెంబరు 1526లో వేణుబాబుకు మరో 41.08 ఎకరాల భూమి అదనంగా ఉన్నట్లు ఆన్‌లైన్లో చూపిస్తోందని తల్లికి వందనం పథకానికి అనర్హులంటూ అధికారులు తిరస్కరించారు. దీంతో వేణుబాబు తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో వాపోయాడు. కోలల పూడి తదితర గ్రామాల నుంచి ఇలాంటి సమస్యలే ఎదురయ్యాయి. ఒకే కుటుంబంలో ఐదు, ఆరుగురు ఉన్నా పథకం మంజూరు చేస్తామంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం అర్హులకు న్యాయం చేయకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

పథకం ఇస్తారా? భూమిని చూపుతారా?



మా స్వగ్రామంలో రెండు ఎకరాల భూమి మాత్రమే ఉంది. అయితే 42 ఎకరాల భూమి ఉన్నట్లు ఆన్లైన్లో చూపిస్తూ నా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అధికారులు నిలిపివేశారు. నాకు లేని భూమిని ఎలా చూపిస్తారు? పథకాన్ని వదులుకుంటాను కానీ అధికారులు భూమినైనా చూపుతారా? నా సమస్యను పరిష్కరించి నా పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వేణుబాబు, బాధితుడు, తాటివారిపాలెం

విత్తనాల ఎంపికే కీలకం


బొల్లాపల్లిలో బొప్పాయి తోట పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


కొప్పరపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

మార్టూరు: వ్యవసాయ పనులు ప్రారంభమైన దృష్ట్యా రైతులు తాము సాగు చేయ బోయే విత్తనాల కొనుగోలు పట్ల జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రామినేని లావణ్య అన్నారు. మండలంలోని వలపర్ల, బొల్లాపల్లి, తాటివారిపాలెంలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం రైతులు మొక్కజొన్న సాగు పట్ల ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారని.. డీలర్ల వద్ద విత్తన కొనుగోలు సమయంలో రసీదులు తీసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రణాళికను అనుసరించి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల నుంచి పెసర, మినుము, వేరుశనగ తదితర విత్తనాల తాలూకు ఇండెంట్లను సేకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మండల అధికారి జి. రాజ శేఖర్ రైతులకు రుతుపవనాలకు ముందు వాడాల్సిన పీఎండీఎస్ కిట్ల గురించి అవగాహన కల్పించారు. అధికారులు ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న బొప్పాయి, మామిడి తదితర పంటలను పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు అందించారు. వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల రైతు సంఘం నాయకుడు వీరవల్లి కృష్ణమూర్తి, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలి

వేటపాలెం: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు కోసం రైతులు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని చీరాల సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి సూచించారు. కొత్తపేట, పాపాయిపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం పొలంపిస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఎం. సరిత దోస పంట పరిశీలించారు. ఏఈఓ గోపికృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు శివ నాగబాబు, వినయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


జె.పంగులూరు: రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుదల

అద్దంకి రూరల్: పచ్చిరొట్ట పంటల సాగుతో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలో ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ 20 రకాల విత్తనాలు కలిపిన కిట్ల రైతులను అందించనున్నట్లు తెలిపారు. దీని వలన 35 నుంచి 45 టన్నుల పచ్చి రొట్ట ఎరువు తయారు అవుతుందని.. భూమిలో కర్బన శాతం పెరుగుతుందని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ సహాకులు రోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మేలు

జె.పంగులూరు: అధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం వలన రైతులకు ఎంతో మేలు అని మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. రామకూరు, నార్నేవారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది జరిగింది. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చాన్నారు. కార్బన శాతం పెరగడం వలన భూమిలో సారవంతమవుతుందని తెలిపారు. పంట మార్పి చేయడం, నేల పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడకం గురించి వివరించారు. పశు వైద్యాధికారి డాక్టర్ మురళి, పశువులకు, గొర్రెలు, మేకలుకు టీకాలు ఏ సమయంలో వేయాలి వాటి వల్ల ఉపయోగాలు గురించి వివరించారు. వ్యవసాయ సహాయకులు పృథ్వీ సాయి, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేసుకోండి

బల్లికురవ: వర్షాలు కురుస్తున్నందున ఖరీఫ్ పంట సాగుకు రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు కోరారు. మంగళవారం వేమవరం, కొప్పరపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు ఎరువుల వాడకాన్ని చేపట్టాలన్నారు. ఏఈఓ మౌలాలి, వీఏఏలు వెంకటేశ్, సుభాని పాల్గొన్నారు.

చీరాల రూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు అన్ని రైతు సేవాకేంద్రాల్లో తమ భూములను ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. నిర్మలాదేవి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిధిలోని చీరాలనగర్, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహించారు. వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలను అందించారు. వీఏఏలు జె. లావణ్య, వై. ధీరజ్, రైతులు పాల్గొన్నారు.


చీరాల: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిర్మలాదేవి


వేటపాలెం: మాట్లాడుతున్న ఏడీఏ రత్నకుమారి


అద్దంకి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

గ్రామసింహాల గర్జన

- బెంబేలెత్తుతున్న జనం
- గ్రామాల నుంచి వీధి కుక్కలను తరిమివేయాలని కోరుతున్న ప్రజలు


ఈపురుపాలెంలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

చీరాల టౌన్: మండలంలోని రూరల్ పంచాయతీల్లో శునకాలు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. ఈపురుపాలెం గ్రామంలోని పద్మనాభునిపేట, నలబై ఇండ్ల కాలనీ, పురుగుల పేట, గాంధీపార్కు సెంటర్, ఆదినారాయణపురం, పాత మునుసుబుగారి వీధి తదితర ప్రాంతాలతో పాటు తోటవారిపాలెంలోని వీవర్స్ కాలనీ, పాత దళితవాడ, సాల్మన్‌సెంటర్, రామకృష్ణాపురం, దేవాంగపురి, పాతచీరాల, వాడరేవు, బుర్లవారిపాలెం తదితర గ్రామాల్లోని వీధుల్లో శునకాలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. బాటసారులు, వాహనదారులపై దాడులు చేసి కరుస్తున్నాయి. అలానే ఈపురుపాలెం నుంచి చీరాల వైపువెళ్లే ప్రధాన రహదారిపై, చీరాల–ఒంగోలు ప్రధాన రహదారిలోని జాండ్రపేట, రామకృష్ణాపురం ప్రాంతాల్లో సంచరిస్తూ వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నడిచివెళ్తున్న, ద్విచక్రవాహనాలపై వెళ్తున్న ప్రజలపై శునకాలు దాడులకు పాల్పడుతుండటంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అలసత్వాన్ని వీడి గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాలను ఊరి నుంచి పంపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలి


శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న సీడీపీఓ సులోచనారాణి

స్వర్ణ (కారంచేడు): అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సెంటర్‌లకు చెందిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ జి. సులోచనరాణి అన్నారు. మంగళవారం స్వర్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణ తరగతిలో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నూతనంగా చేరిన చిన్నారుల పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు, వారి ఎత్తు, బరువులను నమోదు చేసుకోవాలన్నారు. చిన్నారుల గ్రోత్ చార్ట్ ప్రకారం వారి గ్రోత్‌ను పరిశీలించాలన్నారు. బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ పి. త్రివేణి, సూపర్‌వైజర్ వాణీశ్రీ, సునీత, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు దారుణం


నిరసన తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

అద్దంకి: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషమని సీపీఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. ఇజ్రాయిల్ వైఖరిని ఖండిస్తూ పాలిస్తీనాకు మద్దతు తెలియజేస్తూ మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సీపీఎం పార్టీ అద్దంకి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సరం కాలం నుంచి పాలిస్తీనాపై ఇజ్రాయెల్ అమానుషమైన దాడి చేయడం వల్ల ఆ దేశంలోనే అమాయక ప్రజలు 40 వేల మందికి పైగా మరణించారని లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారన్నారు. ఈ దాడిలో పసిపిల్లలతో పాటు మహిళలు అధిక సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్నారని ఇజ్రాయిల్ సైన్యం, ఆ దేశ అధ్యక్షుడు కనీసం తినటానికి తిండి తాగటానికి నీరు కూడా లేకుండా అతి క్రూరంగా ప్రవర్తిస్తూ శరణార్థుల స్థావరాలపై బాంబుల దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోవాలని అలా వెళ్ళిపోయే వారికి పక్క దేశాల్లో ఉండటానికి అవకాశం కల్పిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా మాట్లాడుతున్నారన్నారు. అయినా ఈ చర్యలను ఖండించాల్సిన భారత ప్రధానమంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకుండా మౌనం వహించటం సరికాదన్నారు. పార్టీ సభ్యులు ఎస్‌కే కరీం, తోట వెంకటేశ్వర్లు, తన్నీరు రాజు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఫ్రూట్ టెండర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే యోగా చేయాలి


యోగాసనాలు వేయిస్తున్న డాక్టర్ దాసరి చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): విద్యార్థి దశ నుంచే యోగాభ్యాసనం అలవర్చుకొని ఆరోగ్య వంతమైన జీవితాన్ని గడపాలని మండల యోగా పర్యవేక్షణాధికారి, మాస్టర్ యోగా ట్రైనర్, ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ చెంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పుటూరు ఎంపీపీ స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులచే అనేక రకాల యోగాసనాలు వేయించి యోగ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

రోడ్ల నాణ్యత పరిశీలన


రోడ్డును తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోలు టీం

బల్లికురవ: నాగరికతకు చిహ్నాలైన రహదారుల అభివృద్ధిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ ఈఈలు అశోక్, శ్యామ్ ప్రసాద్, రమేష్ కోరారు. మంగళవారం జాతీయ గ్రామీణ పథకం నిధులు రూ. 3 కోట్లతో జరుగుతున్న చెన్నుపల్లి, వైదన లింకు రోడ్డు అభివృద్ధి పనులను తనిఖీ బృందం నిశితంగా పరిశీలించింది. ఎర్త్ వర్క్, వెట్‌మిక్స్ పనులకు సంబంధించి వివిధ రకాల యంత్రాలతో పరీక్షించి శాంపిల్స్ తీశారు. వ్యవసాయ పనులు సీజన్ ఆరంభం అవుతున్నందున రోడ్డుపై దమ్ము చక్రాల ట్రాక్టర్‌లు తిరగకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే అన్నారు. ఏఈలు మాధవ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వర్ణమ్మ తల్లికి నెల పొంగళ్లు


నెల పొంగళ్ల సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మతల్లి

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మతల్లికి భక్తులు మంగళవారం నెల పొంగళ్లు సమర్పించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు, దాతలు, ఆలయ కమిటీల సహకారంతో చిన్నారులు, మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో సుమారు 3వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ, దేవాదాయశాఖ ఏఓ, సిబ్బంది అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం పూర్వాభాద్ర నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.